సాక్షి గుంటూరు

సోమవారం। 24। జూన్। 2024



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


నరసరావుపేట ఈస్ట్: శ్రీరాంపురంలోని బ్రహ్మంగారి గుడి వద్ద ఆదివారం గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు.



ఐశ్వర్య ప్రదాయినిగా బండ్లమ్మ

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖ బండ్లమ్మ గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఐశ్వర్య ప్రదాయినిగా అలంకరించారు.

నూకాలమ్మ తిరునాళ్ల



చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి కలెక్టర్‌గా రాజకుమారి

గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారికి ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ఎం.వేణుగోపాల్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగలక్ష్మిని నియమించారు. ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతవరకు ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా నియమించారు.

కొండవీడును దర్శించిన ఎన్‌సీసీ బృందాలు



యడ్లపాడు: భిన్న ప్రాంతాలకు చెందిన వారు వారి భావాలు ఒకరితో ఒకరు పంచుకునే విశిష్ట వేదిక ఏక్ భారత్ - శ్రేష్ఠభారత్ అని కల్నల్ చంద్రశేఖర్ చెప్పారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు కోటను పలు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదివారం సందర్శించారు. తొలుత పలు ప్రాంతాలకు చెందిన ఎన్‌సీసీ బృందాలు కోనేరు లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీలో బేస్ క్యాంపు ఏర్పాటు చేసుకుని, అక్కడ నుంచి 13 ప్రత్యేక బస్సులలో 600 మంది కొండవీడు విచ్చేశారు. ఘాట్ రోడ్డు, స్వాగత ద్వారం, యోగి వేమన మండపం, కొండపై ఉన్న పురాతన చెరువులు, ప్రాచీన కట్టడాలు తిలకించారు. క్యాడెట్లకు చారిత్రక అంశాలను, నాటి రాజుల పాలన వైభవాలను వివరించారు. అలాగే విద్యార్థులు తమ ప్రాంతాలకు చెందిన సంస్కృతీ సంప్రదాయాలను ఒకరినొకరు పంచుకున్నారు. క్యాడెట్లు పలు సాహస కార్యక్రమాలను చేపట్టారు. అవుట్‌రైవల్ ట్రెక్కింగ్ అకాడమీ ఆధ్వర్యంలో రాప్లింగ్, ట్రెక్కింగ్, రన్నింగ్ తదితర సాహస క్రీడలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండవీడు కొండలపై సందడి చేశారు. కార్యక్రమంలో కల్నల్ సిద్ధు, కల్నల్ సుదర్శన్, కొండవీడు కోట బీట్ అధికారులు రాజు, కొడాలి వెంకటేశ్వరరావు, అకాడమీ నిర్వాహకురాలు దళవాయి ఆశ, కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి పాల్గొన్నారు.

'హంస' జిల్లా అధ్యక్షుడిగా నాగవర్ధన్



గుంటూరు మెడికల్: ఏపీ హంస (వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల సంఘం) జిల్లా అధ్యక్షుడిగా బి.నాగర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో హంస జిల్లా, నగర కార్యవర్గ ఎన్నిక జరిగింది. హంస సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరవతల్ ఆదేశాల మేరకు స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.శ్రీనివాస్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. జిల్లా కార్యదర్శిగా సీనియర్ అసిస్టెంట్ ఎస్.జీవన్‌బాబు, కోశాధికారిగా బి.వెంకటప్పయ్య ఎన్నికయ్యారు. గుంటూరు నగర అధ్యక్షుడిగా పి.నరేంద్రబాబు, కార్యదర్శిగా ఎల్.శ్రీనివాసరావు, కోశాధికారిగా పెద్ద సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన హంస నేతలకు పలువురు యూనియన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఒక్కరోజే రూ.46.30 లక్షలు ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం రికార్డు స్థాయిలో రూ.46.30 లక్షల మేర ఆదాయం లభించింది. దర్శన టికెట్ల ద్వారా రూ. 24.03 లక్షలు ఆదాయం లభించగా, మిగిలిన ఆదాయం ఇతర ఆర్జిత సేవలు, విరాళాల ద్వారా లభించినట్లు ఆలయ ఈఓ కేఎస్ రామరావు పేర్కొన్నారు. అంతరాలయం, వీఐపీ టికెట్లు 2435 విక్రయం ద్వారా రూ. 12.15 లక్షలు, రూ.300 టికెట్ల విక్రయం ద్వారా 4.72 లక్షలు, రూ.100 టికెట్ల విక్రయం ద్వారా రూ.7.14 లక్షల ఆదాయం లభించింది. 3646 మంది భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించగా, 66,407 లడ్డూలు, 32,135 పులిహోర ప్యాకెట్లను విక్రయించారు. మొత్తంగా దేవస్థానానికి రూ.46,30,636 ఆదాయం లభించింది.

కిక్కిరిసిన కార్తికేయుని సన్నిధి

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. తెల్లవారుజాము నుంచే తెలుగు ఉభయ రాష్ట్రాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆపద్బాంధవులకు అభయం

- చట్టపరంగా రక్షణ
- గుడ్ సమరిటన్ పురస్కారాలు
- మానవత్వం చూపుదాం
- క్షతగాత్రులను కాపాడదాం

● గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు నెత్తురోడుతూ రోడ్డుపై కొట్టుకుంటున్నాడు. ఆ దారిన వెళ్లేవారు అతడిని చూసినా.. దగ్గరకు వెళ్లే సాహసం చేయలేదు. చట్టపరమైన చిక్కులు వస్తాయేమోనని జంకారు. ఒకరు మాత్రం 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. కానీ ఫలితం శూన్యం. అతడు మరణించాడు. కొంచెం ముందుగా తీసుకొస్తే ప్రాణాలు నిలిచేవని వైద్యులు చెప్పారు. ప్రమాదాన్ని గమనించిన వారు వెంటనే స్పందించి ఉంటే ఓ వ్యక్తి ప్రాణాలు దక్కేవి.

-పట్నంబజార్(గుంటూరు ఈస్ట్):

● ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రమాదాలు, ఇతర ఆపదలు సంభవించినప్పుడు ప్రాణాలు కాపాడిన వారికి చట్టం ద్వారా రక్షణ కల్పించే చర్యలు చేపట్టింది. ఆపద్బాంధవులను గుడ్ సమరిటన్‌గా గుర్తించి పురస్కారాలూ అందిస్తోంది.





పెదకాకాని వద్ద ఇటీవల జరిగిన ప్రమాద దృశ్యాలు(ఫైల్)

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సాఫీగా సాగే ప్రయాణంలో ఒక్కోసారి అనుకోని ప్రమాదాలు సంభవిస్తాయి. నిండు ప్రాణాలను బలిగొంటాయి. కుటుంబాలను చీకట్లోకి నెడతాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మన వంతుగా మానవత్వం చూపితే కొన్ని ప్రాణాలైనా నిలబడతాయి. ఆ కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరుస్తాయి. ప్రమాద సమయంలో సాయం చేస్తే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్న భయం అవసరం లేదు. ఆపద్బాంధవులకు ఈ విషయంలో ప్రభుత్వం చట్టపరంగా భరోసా ఇస్తోంది. అంతేకాదు గుడ్ సమరిటన్‌గా కితాబు నిచ్చి నగదు ప్రోత్సాహకాలూ అందిస్తోంది.

➡ గుంటూరు జిల్లాలో రోజూ సగటున 15 ప్రమాదాలు జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

➡ కొద్దిరోజుల క్రితం పెదకాకాని వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఆటోలో డెకరేషన్ పనికి వెళ్ళి వస్తూ.. లారీని ఢీకొట్టంతో ఒక వృద్ధుడు, ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, గోపి అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడిని సకాలంలో తీసుకెళ్లి ఉంటే బతికేవాడు.

➡ ఇటీవల కొరిటెపాడు రోడ్డులో ఒక ఆటో ప్రమాదవశాత్తూ బోల్తా పడి అందులో ఉన్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ వచ్చి ఆస్పత్రికి తీసుకుని వెళ్ళే సరికి మృతి చెందాడు. స్థానికులు స్పందించి ఉంటే అతడి ప్రాణాలు నిలిచేవి.

➡ చుట్టుగుంట వద్ద ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి ఆలస్యం కావడంతో మరణించింది.

ఈ ఇద్దరూ గుడ్ సమరిటన్లు

కొద్ది రోజుల క్రితం రాఘవేంద్ర అనే వ్యక్తి ప్రమాదంలో గాయపడ్డాడు. ముప్పాళ్ళ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన కొమ్మూరి శ్రీనివాసరావు గుర్తించి రాఘవేంద్రను సకాలంలో ఆస్పత్రికి తరలించాడు. దీంతో అధికారులు శ్రీనివాసరావును గుడ్ సమరిటన్‌గా గుర్తించి పురస్కారం అందించారు.

➡ మేడికొండూరు వద్ద వీర్ల వెంకయ్య అనే వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన ముతుకూరి అనిల్‌కుమార్ బాధితుడిని ఆస్పత్రికి తీసుకుని వెళ్ళి అతడి ప్రాణాలు కాపాడాడు. దీంతో అధికారులు అనిల్‌ను గుడ్ సమరిటన్‌గా గుర్తించి నగదు ప్రోత్సాహం, ప్రశంసాపత్రం అందించారు.

గోల్డెన్ అవర్ కీలకం

ప్రమాద సమయంలో తీవ్రంగా గాయపడిన వారికి మొదటి గంట సమయాన్ని వైద్యులు 'గోల్డెన్ అవర్'గా పిలుస్తారు. కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని గంటలోపు దగ్గరలోని ఏదైనా ఆస్పత్రిలో చేర్చగలిగితే అతని ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఎంపికకు కమిటీ

ప్రమాదాలు, ఆపదల సమయాల్లో క్షతగాత్రులను కాపాడిన వారికి గుడ్ సమరిటన్ పురస్కారాలను ప్రభుత్వం అందిస్తోంది. రూ.5వేల నగదు ప్రోత్సాహం, ప్రశంసా పత్రం అందజేస్తోంది. గుడ్ సమరిటన్ల ఎంపికకు జిల్లాస్థాయి కమిటీ ఉంటుంది. కమిటీలో కలెక్టర్, ఎస్పీ, డీఎంహెచ్‌ఓ, డీటీసీ సభ్యులుగా ఉంటారు.

జిల్లాలో ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	మరణించిన వారి సంఖ్య	క్షతగాత్రుల సంఖ్య
2022	1,084	422	2,103
2023	965	328	1,722
2024	370	145	650

(ఇప్పటివరకు)

చట్టపరంగా రక్షణ

ప్రమాదాల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనేవారి రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించింది. 2020 సెప్టెంబర్‌లో మోటార్ వాహనాల చట్టం–1988లో సెక్షన్ 134ఏ, సీఎంవీ రూల్ 168, 169ని చేర్చింది. దీనివల్ల ప్రమాదాల్లో సాయం చేసిన వారికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. కేసులు భయం ఉండదు.

మానవత్వం మన బాధ్యత



ప్రమాదాల్లో గాయపడి ప్రాణాల కోసం పోరాడుతున్న సాటివారికి సాయం అందించి మానవత్వం చాటుకోవటం మనందరి బాధ్యత. రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను కాపాడడం ద్వారా ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపగలం. అలాగే అందరూ రహదారి భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించగలం.

– షేక్ కరీం (డీటీసీ) గుంటూరు

అందరి సహకారంతో అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



పెండింగ్ పనుల వివరాలను పరిశీలిస్తున్న మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: పట్టణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను అధికారులు, సహచర ప్రజా ప్రతినిధుల సహకారంతో పూర్తిచేస్తామని, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. పలు అభివృద్ధి పనులపై ఆయన ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, శాసన సభ్యులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం పెమ్మసాని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల్లో అనేక సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. ఇకపై ప్రతి నెలా సమీక్షలు ఉంటాయని వివరించారు. పెండింగ్ పనులపైనా డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని వెల్లడించారు. త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని పెమ్మసాని పేర్కొన్నారు. సమావేశంలో శాసన సభ్యులు గళ్ళా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.00 అడుగుల వద్ద ఉంది.

ఓవర్ ది 'టాప్'

ఓటీటీకి యమ క్రేజ్

- స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలకు విపరీతంగా పెరిగిన ఆదరణ
- ఖర్చు తక్కువ, సౌలభ్యం ఎక్కువ
- సరికొత్త సినిమాలు, కంటెంట్‌తో ఆకట్టుకుంటున్న వైనం
- కుటుంబంతో కలిసి టీవీలోనే హాయిగా వీక్షించే వెసులుబాటు
- అన్నివర్గాలకూ అందుబాటులో ప్లాన్లు
- థియేటర్లకు వెళ్లే వారి సంఖ్య తగ్గుముఖం



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నెట్‌ఫ్లిక్స్.. డిస్నీ హాట్ స్టార్.. అమెజాన్ ప్రైమ్.. ఆహా.. జీ5.. జియో.. సోనీలివ్ ఏదైనా కాని ఐదేళ్ల క్రితం వరకు ఈ ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫాంల గురించి తెలిసింది కొద్దిమందికే. అన్ని రంగాలనూ కుదేలు చేసిన కరోనా ఓటీటీలకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. లాక్‌డౌన్‌తో ఇళ్లకే పరిమితమైన ప్రజలకు ఓటీటీలు ఏకైక వినోద సాధనమయ్యాయి. సరికొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు, సీరియళ్లు, వినూత్న కంటెంట్‌తో ఆకర్షించాయి. చౌకైన ప్లాన్లు, ఇంటిల్లిపాదీ చూసే వీలుండటంతో అతికొద్ది కాలంలోనే వీటికి జనాదరణ అమాంతం పెరిగింది. భారీ బడ్జెట్ సినిమాలూ నేరుగా ఓటీటీలోకి వస్తున్నాయంటే వీటి క్రేజ్‌ను అర్థం చేసుకోవచ్చు.

థియేటర్లు భారమయ్యే..!

మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు మంచి వినోద సాధనం సినిమా. గతంలో ఇంటిల్లిపాదీ అంతా కలిసి థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసేవాళ్లు. ఫలితంగా గుంటూరు నగరంలో సుమారు 50 వరకు థియేటర్లు, మల్టిప్లెక్సీలు ఏర్పాటయ్యాయి. వినోదంతోపాటు షాపింగ్, ఫుడ్ పాయింట్ కేంద్రాలుగా థియేటర్లు, మల్టీప్లెక్సీలు మారాయి. కాలక్రమంలో టికెట్, పార్కింగ్, ఇంటర్వెల్ సమయంలో స్నాక్స్, కూల్‌డ్రింక్ ధరలు సామాన్య ప్రేక్షకుడికి భారమయ్యాయి. ఫలితంగా థియేటర్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తే పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం భార్య, భర్త, ఇద్దరు పిల్లలు సినిమాకు వెళితే సగటు ప్రేక్షకుడికి రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఖర్చవుతోంది. దీంతో ప్రజల చూపు ఓటీటీల వైపు మళ్లింది. ఒకసారి కుటుంబంతో థియేటర్‌కు వెళ్లి ఒక సినిమా చూడటానికి అయిన ఖర్చుతో ఒకటి, రెండు ఓటీటీలను ఏడాదంతా చూడవచ్చు. దీంతో థియేటర్లు వెలవెలబోతున్నాయి. కేవలం కొత్త సినిమాల విడుదల సమయంలోనే ఒకటి రెండు రోజులు సినిమా హాళ్ల వద్ద కొంత మేర రద్దీ ఉంటుంది. దీంతో నిర్వహణ ఖర్చులు కూడా రావడం లేదని, నష్టాల్లో నడుపుతున్నామని థియేటర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ టీవీలతోపాటే ఓటీటీ యాప్‌లు

ఓటీటీ అంటే కేబుల్ టీవీ, డీటీహెచ్ కనెక్షన్ అవసరం లేకుండా ఇంటర్నెట్ ద్వారా వినోదాన్ని అందించే సాధనం. దీనినే డిజిటల్ స్ట్రీమింగ్ మీడియా సర్వీస్ అని కూడా పిలుస్తారు. వీటిల్లో వెబ్ సిరీస్, టీవీ కార్యక్రమాలు, సెలెబ్రిటీ ఇంటర్వ్యూలు, షోలు, సినిమాలు ప్రసారం చేస్తారు.

ప్లాన్లతో ఆకర్షిస్తూ...

ఓటీటీ ప్లాట్‌ఫాంలు క్వార్టర్, హాఫ్ ఇయర్లీ, ఇయర్లీ పేరిట తక్కువ ధరల సబ్‌స్క్రిప్షన్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. రీచార్జి ప్లాన్‌ను బట్టి టీవీతోపాటు సెల్‌ఫోన్ ఇతర ఐదు వరకు డివైజ్‌లలో ఆయా యాప్‌లను ఏడాదిపాటు చూడొచ్చు. ఇంటర్నెట్ ద్వారా ఓటీటీ పనిచేయడం వలన అంతరాయం లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు నచ్చిన కార్యక్రమాలు చూసే వీలుంటుంది. ఎలాంటి ప్రకటనలూ లేకుండా సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూసే వీలుండటం, కొన్ని ఓటీటీల్లో టీవీ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారాలు రావడం వీటికి బాగా కలిసొచ్చింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ తీసుకోలేని వారి కోసం ఉచితంగా కొన్ని ఓటీటీలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి రుసుము లేకుండానే వీటిల్లో కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూడచ్చు. అయితే వీటిలో వాణిజ్య ప్రకటనలు అధికంగా ఉంటాయి.

ఓటీటీ యాప్‌లు స్మార్ట్ టీవీల్లోనే ఇన్‌స్టాలై ఉండటం, తక్కువ ధరలు, సులభ వాయిదాల్లో ఈ టీవీలు లభ్యమవుతుండటంతో అన్నివర్గాల వారు వీటి కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు చాలా వరకు ఇళ్లల్లో స్మార్ట్ టీవీలే కనిపిస్తున్నాయి. ఏపీ ఫైబర్, ఇతర ప్రైవేట్ ఆపరేటర్లు తక్కువ ప్లాన్లలోనే నెట్ సదుపాయం అందిస్తుండటం ఓటీటీకి వరంలా మారింది.

నేరుగా ఓటీటీలోనే...

చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకు, చిన్న సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు కొన్ని నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా మరికొన్ని వారం పదిరోజుల్లో ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రతి శుక్రవారం కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లతో ఓటీటీలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లిష్‌తోపాటు చైనీస్, జపాన్, కొరియన్ సినిమాలు, వెబ్‌సిరీస్‌లు స్థానిక భాషల్లో అందుబాటులోకి వస్తున్నాయి.

కన్నీటి అల

- ఇద్దరి ప్రాణాలు తీసిన సముద్రస్నానం
- రెండు కుటుంబాలకు తీరని వేదన
- కొప్పరావు కాలనీలో విషాదం





బాలనాగేశ్వరరావు (ఫైల్) పడవల బాలసాయి (ఫైల్)

మంగళగిరి: స్నేహితులతో సరదాగా సముద్రస్నానానికి వెళ్లిన ఆ ఇద్దరూ విగతజీవులయ్యారు. కుటుంబాలకు తీరని వేదన మిగిల్చారు. ఆదివారం బాపట్ల జిల్లా రామాపురంలో జరిగిన ఈ హృదయ విదారక ఘటనతో మంగళగిరి కొప్పరావు కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరిలో బంగారం పని చేసే 12 మంది స్నేహితులు ఆదివారం సరదాగా గడిపేందుకు బాపట్ల జిల్లా రామాపురం సముద్ర తీరానికి వెళ్ళారు. సముద్రంలో స్నానానికి దిగి ఈత కొడుతుండగా కొసనం బాలనాగేశ్వరరావు (24), పడవల బాలసాయి (26)తోపాటు మరో ఇద్దరు అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఈ నేపథ్యంలో మిగతా స్నేహితులు వారిని రక్షించేందుకు యత్నించారు. ఇద్దరిని కాపాడగలిగారు. బాలనాగేశ్వరరావు, బాలసాయి ఆచూకీ కానరాలేదు. చివరకు మధ్యాహ్నం ఇద్దరి మృతదేహాలు సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. దీంతో స్నేహితులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కొప్పరావు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వృద్ధ తల్లిదండ్రులకు అతడే ఆధారం

బాలనాగేశ్వరరావు కొసనం సాంబశివరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు. వీరికి బాలనాగేశ్వరరావుతోపాటు కూతురు ఉంది. ఆమెకు పెళ్లయింది. నాగేశ్వరరావు తండ్రి వృద్ధాప్యంలో ఉన్నాడు. అడపాదడపా చేనేత పనులు చేస్తుంటాడు. బంగారం పనిచేసే నాగేశ్వరరావే ఆ కుటుంబానికి ఆధారం. ఈ నేపథ్యంలో కుమారుడి మృతితో వృద్ధ తల్లిదండ్రులు దిక్కులేనివారయ్యారు. గుండెలవిసేలా రోధిస్తున్నారు.

మూడునెలల పాపకు తండ్రి దూరం

పడవల రఘునాథరావు, వెంకటరత్నలకు ఇద్దరు కుమారులు. వీరిలో పడవల బాలసాయికి భార్య, మూడు నెలల పాప ఉన్నారు. బాలసాయి తండ్రి రఘునాథరావు చేనేత పనులు చేసేవాడు. పక్షవాతానికి గురయ్యాడు. ప్రస్తుతం కోలుకుని సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బాలసాయి మృతితో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

శోకసంద్రంలో యాజలి

- అమెరికాలో దుండగుడి కాల్పుల్లో మృతిచెందిన కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన గోపీకృష్ణ
- ఒక్కగానొక్క కొడుకు మృతిచెందటంతో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు



విలపిస్తున్న గోపీకృష్ణ తల్లిదండ్రులు

కర్లపాలెం: అమెరికా వెళ్లి మంచి ఉద్యోగం చేసి మీకు ఏ కష్టం రాకుండా చూసుకుంటానని చెప్పి వెళ్లిన కుమారుడు దుండగుడి కాల్పులలో మృతి చెందాడని తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు, అతని భార్య ఒక్కసారిగా కుప్పకూలి బోరున విలపించారు. వివరాల్లోకి వెళితే.. యాజలి గ్రామంలో దాసరి శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతులు కూలి పనులు చేసుకుంటూ తమ కుమారుడు గోపీకృష్ణను బీటెక్ వరకు చదివించారు. గోపీకృష్ణ హైదరాబాద్ వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. అనంతరం హెచ్‌వన్‌బీ వీసా రావటంతో ఉద్యోగం కోసం సుమారుగా 11 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ టెక్సాస్ రాష్ట్రంలో ఉన్న డెల్లాస్ సిటీలో సూపర్ మార్కెట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ఓ దుండగుడు సూపర్ మార్కెట్‌కి వచ్చి గోపీకృష్ణపై గన్‌తో కాల్పులు జరిపి ఏవో వస్తువులు తీసుకుని పారిపోయాడు. కాల్పుల్లో తీవ్రగాయాలపాలైన గోపీకృష్ణ అక్కడే కుప్పకూలి పోగా స్థానికులు ఓ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందటంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గోపీకృష్ణకు రెండున్నరేళ్ల క్రితం గుంటూరు సమీపంలోని ఓబులునాయుడు పాలెం గ్రామానికి చెందిన ప్రవల్లికతో వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు ఉన్నాడు. ప్రతిరోజూ ఫోన్ చేసి బాబు ఎలా ఉన్నాడు.. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని చెప్పే భర్త మృతిచెందాడని చెబుతూ భార్య బోరున విలపించింది. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడు.. ఇంక మాకెవరు దిక్కు దేవుడా .. అంటూ అనారోగ్యంతో ఉన్న తండ్రి శ్రీనివాసరావు, తల్లి లక్ష్మీలు రోదిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టిస్తోంది.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



రద్దీని పర్యవేక్షిస్తున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):వేసవి సెలవులు ముగిసినప్పటికీ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏకరీతిన భక్తుల రద్దీ కొనసాగింది. సాధారణ భక్తులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరో వైపున అమ్మవారికి జరిగిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు ఆదివారం విశేషంగా నిర్వహించే సూర్యోపాసన సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు రూ. 300 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

కిటకిటలాడిన క్యూలైన్లు...

ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల రద్దీ కనిపించింది. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు గంటలు సమయం పట్టింది. రూ. 100, రూ.300, రూ.500 క్యూలైన్లలో సైతం రద్దీ ఉంది. మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు ఆయా టికెట్ల క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఘాట్‌రోడ్డులోని క్యూలైన్లు ఓం టర్నింగ్ వరకు చేరుకున్నాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో టికెట్ల ఆదాయం భారీగానే సమకూరింది. భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కెఎస్.రామరావు క్యూలైన్లను పర్యవేక్షించారు. రద్దీని అనుగుణంగా క్యూలైన్లు ముందుకు నడిచేలా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

ఐదు మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. దుగ్గిరాల మండలంలో 12.8 మిల్లీమీటర్లు, కొల్లిపర 5.4 మి.మీ., తుళ్లూరు 3.8 మి.మి., మంగళగిరి 2.2 మి.మీ., పెదనందిపాడు మండలంలో 1.2 మి.మీ. చొప్పున వాన పడింది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):నందివెలుగు రైల్వే గేటు నుంచి తెనాలి వెళ్లే రైలు మార్గంలో ఆదివారం పట్టాలు దాటుతున్న సమయంలో వందే భారత్ రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వృద్ధుడు (65) అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు పొడవాటి గడ్డంతో బూడిద రంగు షాట్, నీలి, తెలుపు రంగుల అడ్డ చారలు ఉన్న బూడిద రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 9440627546, 7207076614 నంబర్లకు సమాచారం తెలపాలని సీఐ కోరారు.

కృష్ణానదిలో జారిపడి లారీ డ్రైవర్ మృతి



తాడేపల్లిరూరల్ : బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పాతరలంక గ్రామానికి చెందిన రాజులపాటి వెంకటేశ్వరరావు (35) ప్రమాదవశాత్తు కృష్ణానదిలో జారిపడి మృతి చెందాడు. మృతుడి తల్లి బసవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ కథనం ప్రకారం.. రాజుపాలి వెంకటేశ్వరరావు లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఇద్దరూ విడిపోయారు. వెంకటేశ్వరరావు తన స్వగ్రామమైన పాతరలంక గ్రామంలో తల్లి వద్ద ఉంటున్నాడు. పాతరలంక నుంచి తాడేపల్లి వచ్చిన వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద కృష్ణానదిలో స్నానం చేయడానికి దిగి ప్రమావశాత్తు నీటిలో జారి పడి మరణించాడు. ఈ ఘటనపై తల్లి బసవమ్మకు సమాచారం తెలియడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాయిప్రసాద్ వెల్లడించారు.

విత్తన చట్టం.. మోసాలకు కళ్లెం

- ప్రైవేట్ విత్తన, ఎరువుల దుకాణాల్లో లైసెన్స్ ప్రదర్శన తప్పనిసరి
- ప్రతి కొనుగోలుదారుకూ రసీదు ఇవ్వాల్సిందే

కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇదే తరుణంలో ప్రైవేట్ ఎరువులు, విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని రైతులను మోసగించే చర్యలకు క్లెం వేసేందుకు విత్తన చట్టం ఒకటి ఉందని పూర్తి స్థాయిలో రైతులకు తెలియదు.

విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా ఈ చట్టం ద్వారా సంబంధిత విత్తనాల విత్తనాల డీలర్లపై కఠిన చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

మోసగిస్తే కఠిన చర్యలు..

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా విత్తన చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినమైన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం-1966, విత్తన నిబంధనలు-1968, విత్తన నియంత్రణ-1983 చట్టాల ఆధారంగా అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా విత్తన చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజ్- 3 కింద అతిక్రమించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్-'ఏ' ప్రకారం జరిమానాకు గురవుతారు. వీటిలో కొన్ని చట్టాలను గమనిస్తే...



విత్తన లైసెన్స్ ప్రదర్శించాలి..

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. విత్తన లైసెన్స్ లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలను నిలిపివేయవచ్చు. అంతేకాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్స్ సస్పెండ్, రద్దు చేయవచ్చు.

ధరల బోర్డు, స్టాకు బోర్డు ఏర్పాటు చేయాలి..

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అంతేకాకుండా అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్స్ సస్పెండ్, రద్దు చేయవచ్చు.

అమ్మకాల రశీదు ఇవ్వాల్సిందే..

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సును సస్పెండ్, రద్దు చేయవచ్చు.

విత్తనాల బస్తాలపై లేబుల్ లేకపోతే..

ప్రైవేట్ విత్తనాల అమ్మకందారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం-1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. అంతేకాకుండా ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం -1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం-1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 8ను అనుసరిస్తూ డీలర్ లైసెన్స్ సస్పెండ్, రద్దు చేయవచ్చు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 400 ప్రైవేట్ డీలర్ల దుకాణాలున్నాయి. వీటిలో సుమారు 150 విత్తన విక్రయ డీలర్లు, మిగిలిన 2,50 దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తుంటారు.

> **నిబంధనలు పాటించాల్సిందే..**
>
> ప్రభుత్వం రూపొందించిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది.
>
> –నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

ఎర్రాప్రగడ నేలపై పురస్కారం అందుకోవడం అదృష్టం

పోలూరి వెంకట శివరామప్రసాద్

అద్దంకి రూరల్: పద్యం పుట్టిన గడ్డ, ఎర్రాప్రగడ నడయాడిన నేలపై పురస్కారం అందుకోవడం గొప్ప అనుభూతినిచ్చిందని ఆధ్యాత్మిక ప్రవచన కర్త, రచయిత, వైదిక వాఙ్మయ పరిశోధకుడు పోలూరి వెంకట శివరామ ప్రసాద్ అన్నారు. ఆదివారం సాహితీ మిత్ర మండలి అద్దంకి ఆధ్వర్యంలో స్థానిక మారం వారి సేవాసదన్‌లో పోలూరి వెంకట శివరామప్రసాద్ దంపతులకు ఆత్మీయ పురస్కారాన్ని అందజేశారు.

కార్యక్రమానికి లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, లక్కరాజు శ్రీనివాసరావు ఆధ్యాత్మిక గ్రంథాలను పరిచయం చేశారు. మనసుకు ప్రశాంతత కలిగించే ఆధ్మాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలని వెంకట శివరామప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్తు, యు.దేవపాలన, అన్నమనేని వెంకటరావు, మారం కోటేశ్వరరావు, ఆర్‌వీ రాఘవరావు, జె.ప్రతాప్, జి.హరనాథ్‌బాబు, జమ్మలమడక హనుమంతరావు, వారణాసి రఘురామశర్మ, మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, అంజాద్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట శివరామప్రసాద్

ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

నరసరావుపేట టౌన్: ప్రైవేటు బస్సు ఢీకొని ఇద్దురు గాయపడిన ఘటన పట్టణంలోని అరండల్‌పేట కాసు బ్రహ్మనందరెడ్డి కాంప్లెక్స్ సెంటర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు కళాశాల యజమాని కుమార్తె ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు ప్రైవేటు కళాశాలకు చెందిన సిబ్బంది వేచి ఉండగా వారిని ఎక్కించుకునేందుకు వచ్చిన ప్రైవేటు కళాశాల బస్సు అదుపుతప్పి వారి కాళ్ల మీదుగా వెళ్లింది. దీంతో ఇద్దరికి గాయాలు కాగా వారిని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే దీనిపై బాధితులు, కళాశాల యజమానులు రాజీ పడటంతో పోలీసుల వరకు ఫిర్యాదు వెళ్లలేదు.

కలిమిశ్రీ దంపతులకు పురస్కారం ప్రదానం



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన సాహితీవేత్త, సాహిత్య మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ దంపతులను చీరాలకు చెందిన సహజ సాహి తీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి గానూ అందే మల్లికార్జునరావు, ఆదిలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేసినట్లు కలిమిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలలోని సీనియర్ సిటిజన్స్ హాల్లో ఆదివారం అవార్డు ప్రదానం చేశారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు బండ్ల తారకేష్, వడిలి రాధాకృష్ణ, చిత్రాడి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారన్నారు. సహజ సాహితీ సేవా సంస్థ ఏటా వివిధ రంగాల్లోని సాహితీ ప్రముఖుల సేవలను గుర్తించి వారికి పురస్కారాలను ప్రదానం చేస్తుందని తెలిపారు. కలిమిశ్రీ సుదీర్ఘకాలంగా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ద్వారా ఇప్పటిదాకా వందలాది కార్యక్రమాలు నిర్వహించారు. పలు కథా సంకలనాలకు సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించారు. నవ మల్లెతీగ సాహిత్య మాసపత్రికను నిర్వహిస్తున్నారు. కలిమిశ్రీ పురస్కారం అందుకున్న సందర్భంలో నగరానికి చెందిన పలు సాహిత్య సేవా సంస్థలు ఆయనను అభినందించాయి.

రోశయ్య స్మృతి వనం ఏర్పాటుకు కృషి

రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డ:ఏనాడూ అప్పులు జోలికి వెళ్లకుండా ఆర్థికశాఖను నడపిన దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య స్మృతి వనం ఏర్పాటుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం కృషితో రాజకీయ నేతగా ఎదిగిన గొప్పనాయకుడు రోశయ్య అని కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా 16 సార్లు బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన రోశయ్య ఏనాడూ ఓవర్ డ్రాఫ్టుకు వెళ్లలేదన్నారు. ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టిన గొప్ప వ్యక్తి అన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో విశిష్టత కలిగిన నేతగా చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జనసేన యువనేత మండలి వెంకట్రామ్ (రాజా), ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ ముత్యాల నాయుడు, రోశయ్య వ్యక్తిగత కార్యదర్శి ఉమ్మారెడ్డి రామారావుతో పాటు ఆరు మండలాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-16 బాలుర క్రికెట్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూలై 24వ తేదీ వరకు నెలరోజులపాటు అండర్-16 బాలుర క్రికెట్ పోటీలు జరుగుతాయని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి దాసరి రమేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 13 జట్లు పాల్గొంటాయన్నారు. ఒక్కొక్క జట్టు ఆరు మ్యాచ్‌లను ఆడుతుందన్నారు. నెల రోజులపాటు జరిగే పోటీల్లో ప్రతిభ కనబరచిన 24 మందిని ఎంపిక చేసి మళ్లీ వారికి పోటీలు నిర్వహించి రాష్ట్ర అండర్-16 బాలుర క్రికెట్ తుది జట్టును ప్రకటిస్తామన్నారు. పోటీలు పేరేచర్ల, చిత్తూరు, వెస్ట్‌గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలులో జరుగుతాయన్నారు. యువ క్రికెటర్లకు గొప్ప అవకాశం ఏసీఏ కల్పిస్తుందని తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

- చికిత్స పొందుతూ మృతి
- వైఎస్సార్ కాలనీలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వివాహేతర సంబంధం నేపథ్యంలో ఆటో డ్రైవర్‌పై భార్యాభర్తలిద్దరు రెంచీ, చాకుతో దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనలో తీవ్రగాయాల పాలైన ఆటోడ్రైవర్ మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో మద్దా రవికుమార్ (27) తన భార్య, తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నాడు. రవికుమార్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. రవికుమార్ నివాసం ఉండే బ్లాక్‌లోనే కిరణ్‌కుమార్, భవానీ అనే భార్యాభర్తలు కాపురం ఉంటున్నారు. గత కొంత కాలంగా రవికుమార్‌కు , భవానీలకు వివాహేతర సంబంధం నడుస్తుంది. ఈ విషయం కిరణ్‌కుమార్‌కు తెలియడంతో పెద్దల మధ్య పెట్టి రాజీ కుదుర్చుకున్నారు. అయితే మళ్లీ రవికుమార్ భవానీతో మాట్లాడే ప్రయత్నం చేయసాగాడు. ఇందుకు ఇష్టం లేని భవానీ విషయాన్ని తన భర్త దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఈ నెల 20వ తేదీ శుక్రవారం రాత్రి కిరణ్ కుమార్, భవానీలు రవికుమార్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో రవికుమార్ ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులను హెచ్చరించారు. రవికుమార్ తన భార్యతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఇది పద్ధతి కాదని వారించారు. అయితే ఈ విషయాన్ని రవికుమార్ భార్య ఫోన్ చేసి భర్తకు చెప్పింది. రాత్రి 10 గంటల సమయంలో రవికుమార్ ఆటోలో ఇంటికి వస్తుండగా, కాలనీ మెయిన్ రోడ్డులోని సప్తగిరి బ్యాంక్ వద్ద కిరణ్‌కుమార్‌కు ఎదురయ్యాడు. దీంతో ఆటోను అడ్డగించిన కిరణ్, భవానీలు గొడవకు దిగారు. కోపం ఊగిపోయిన కిరణ్‌కుమార్ తన వద్ద ఉన్న రెంచీతో రవి తలపై దాడి చేశాడు. భార్యాభర్తలు తీసుకొచ్చిన స్కూటీలో నుంచి చాకు తీసి రవికుమార్ తల, శరీరంపై పలు చోట్ల పొడిచారు. దీంతో తీవ్రగాయాలైన రవికుమార్ గట్టిగా కేకలు వేయడంతో భార్యాభర్తలిద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. గాయాలైన రవికుమార్ తన ఫోన్‌లో భార్య, తల్లికి విషయం చెప్పడంతో వారు హుటాహుటిన వచ్చారు. వెంటనే రవికుమార్‌ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. రవికుమార్ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు హత్య కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

రేషన్ డీలర్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలి



మంత్రి మనోహర్‌తో జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాద్

తెనాలి: సమ్యలు పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్ల అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాద్ ఆధ్వర్యంలో సంఘ నేతలు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఆదివారం తెనాలిలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం రేషన్ డీలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఆహార భద్రతా చట్టంలోని డీలర్లకు సంబంధించిన హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రేషన్ డీలర్లకూ లాగిన్ ఇప్పించి వారిచేత 365 రోజులు పని చేయించుకుని కనీస వేతన చట్టం అమల్లోకి తీసుకువచ్చి కమీషన్‌తో కూడిన గౌరవ వేతనం ఇప్పించాలని కోరారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్ డీలర్లకు సరుకు ఎగుమతి చేసేటప్పుడు డీలర్ సమక్షంలోనే ఖచ్చితమైన తూకం వేసి సరుకు లిఫ్టింగ్ జరిగేలా చూడాలని విన్నవించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో చనిపోయిన రేషన్ డీలర్లకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కొంతమంది ఎండీయూలు రేషన్ డీలర్లకు స్టాకు రిటర్న్ చేసేటపుడు డబ్బులు, సరుకులు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నాదెండ్ల మనోహర్, సంఘ నేతలతో సమావేశమై సమ్యలను చర్చిద్దామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు డీలర్లు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమర్షియల్ ట్యాక్స్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్

మంగళగిరి: కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కమర్షియల్ ట్యాక్స్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆటోనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ 2023లో నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని బదిలీ చేశారని, 1,400 పోస్టులు రద్దు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 డివిజన్ల నుంచి 100 మంది సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జి.ఎస్.వి.రత్నకుమార్, గుంటూరు డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతదేశమే పూజా మందిరం

ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు దంపతులకు ఆశీస్సులు అందజేస్తున్న చాగంటి

నరసరావుపేట ఈస్ట్: భారతదేశమే పెద్ద పూజా మందిరమని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. జమిందార్ ఫంక్షన్ హాల్‌లో వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో బ్రహ్మశ్రీ చాగంటి పాల్గొని నిత్య పూజా విధానంపై మాట్లాడారు. భారతదేశం తనంతట తానుగా పూజా మందిరంగా మారిన వైనాన్ని వివరించారు. దేశంలోని నర్మదా నదిలో శివ సాలగ్రామాలు, సువర్ణముఖీ నదిలో అమ్మవారి సాలగ్రామాలు, తంజావూరు సమీపంలోని వెల్లమ క్షేత్రంలో సూర్య, శోణభద్ర నదిలో గణపతి, గండకీ నదిలో విష్ణు సాలగ్రామాలు లభించి పూజలందుకుంటున్నాయని వివరించారు. మనది కర్మభూమి, వేద భూమిగా ప్రపంచంలో గుర్తింపు పొందిందనీ, మనం చేసే యజ్ఞ యాగాది క్రతువుల వలన యావత్ ప్రపంచం శాంతిగా ఉంటుందని తెలిపారు. వసుధైక కుటుంబం మన ఆర్యోక్తిగా మారిందని వివరించారు. భగవంతుని పూజకు మనస్సు ప్రధానమని తెలిపారు. తనపై మనస్సును ఎంత నిలబెట్టారు అనే దానిపైనే భగవంతుని అనుగ్రహం ఉంటుందని వివరించారు. పూజకు ప్రాణం ధ్యానం అని తెలిపారు.

ఆశీస్సులు అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సుధారాజేశ్వరి దంపతులు కలసి ఆశీస్సులు అందుకున్నారు. ప్రవచనం ప్రారంభ సమయంలో తనను కలసిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుతో నరసరావుపేటతో తనకున్న అనుభవాలను చాగంటి పంచుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండకు పలుమార్లు వచ్చి త్రికోటేశ్వరస్వామివారిని దర్శించుకున్నానని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బహుమతులు అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి

ఏఎన్‌యూ: యోగాతో సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి అన్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 19 నుంచి 23 వరకు జరిగిన సదరన్ రీజన్ స్థాయి యోగా ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ యోగాతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యోగా ఫెస్ట్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ ఫెస్ట్‌లో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైల్వే, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధులు హాజరయ్యారని ఫెస్ట్ నిర్వాహకులు కుమేద్ మేహారా తెలిపారు. గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి శైలజ, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉంటాం

ఏపీ ఎరుకల ఆత్మగౌరవ సేవా సంఘం అధ్యక్షుడు రామకృష్ణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరిజనుల అవసరాలను తెలుసుకోవడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఎరుకల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిల రామకృష్ణ తెలిపారు. విజయవాడలోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్యుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. పార్టీలకు అతీతంగా సంఘ పెద్దలతో కలిసి గిరిజనుల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పని చేస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తూ గిరిజన ప్రజలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన యూనివర్సిటీలను మొదలుపెట్టి దాదాపు 72 శాతం పనులు పూర్తి చేశారని వెల్లడించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి గిరిజన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రస్తుత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్టీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి గిరిజన ప్రజలకు సబ్సిడీతో కూడిన రుణాలను ఇవ్వాలని కోరారు. కూటమి ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాల లబ్ధిని, బ్యాంక్ ఖాతాలో జమ చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముద్దుల అంకాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మానిక్ హనుమంతరావు, కావాడి పోచయ్య, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.రాంబాబు, అడిషనల్ జనరల్ సెక్రటరీ సజ్జ రమేష్ పాల్గొన్నారు.

చారిత్రక సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలి



శిల్పాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం రామతీర్థంలోని శ్రీమోక్షరామలింగేశ్వరాలయం ఆవరణలో ఉన్న క్రీస్తు శకం 16వ శతాబ్దానికి చెందిన నిలువెత్తు వీరభద్రుడి విగ్రహాన్ని రక్షించి ఆలయం ఆవరణలో భద్రపరచాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి, ప్లీచ్ ఇండియా సంస్థ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామతీర్థం ఆలయ పరిసరాలను పరిశీలించామని తెలిపారు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న వీరభద్రుడి విగ్రహం ఆలయం ఆవరణలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉందని పేర్కొన్నారు. ఈ ఆలయం ఆవరణలోనే క్రీస్తు శకం 3వ శతాబ్దం నాటి బౌద్ధ ఆనవాళ్ళను కూడా గుర్తించామని వివరించారు. ఆలయ పరిసరాల్లో పల్నాటి సున్నపురాతి బౌద్ధ స్తంభాన్ని దానిపై అర్ధచంద్రాకార పద్మాన్ని గుర్తించామన్నారు. ఈ శిల్ప శైలిని బట్టి ఈ బౌద్ధ చిహ్నం ఇక్ష్వాకుల కాలం నాటిదని తెలిపారు. ఆలయం ఆవరణలో ఉన్న చారిత్రక సంపద గురించి అక్కడి పూజారులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. ఈ చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.